క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి 'యోగా'కు వాడపాలెం విద్యార్థులు


రాష్ట్ర యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో యోగా మాస్టర్ శ్రీనివాస్

కొత్తపేట: అనకాపల్లిలో ఈ నెల 25 న జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కొత్తపేట మండలం వాడపాలెం విద్యార్థులు 9 మంది ఎంపికైనట్టు స్థానిక వివేకానంద యోగా ఆశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అమలాపురం కామాక్షి పీఠంలో జరిగిన యోగా పోటీల్లో వాడపాలెం పాఠశాల విద్యార్థులు బి.మేఘన, వి.సారిక, వి.శ్రావణి, జి.నందిని, ఎస్.మోక్ష, జి.నిఖిల, ఎం.హేమదీక్షిత, జి.అఖిల, ఎం.అనిష్కవిద్య అత్యుత్తమ ప్రతిభను కనబరచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శిగా 'బండారు'

రాజోలు: రాష్ట్ర వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాజోలుకు చెందిన బండారు కాశీ నియమితులయ్యారు. ఆదివారం ఈ మేరకు రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బండారు కాశీని సత్కరించారు. పార్టీ విజయానికి కృషి చేస్తానని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

జాతీయ రహదారిపై పోలీసుల తనిఖీలు


నగరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సురేష్, సిబ్బంది

మామిడికుదురు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరం గ్రామంలోని 216వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరం ఎస్సై పి.సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను నిశితంగా తనిఖీ చేశారు. సుమారు రెండు గంటల పాటు ఎన్‌హెచ్‌పై వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. సరైన ఆధారాలు లేకుండా నగదు తరలించడం, అక్రమంగా మద్యం తరలించినా ఉపేక్షించేది లేదని అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్ హెచ్చరించారు.

పి.గన్నవరంలో వాహనాల తనిఖీ

పి.గన్నవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బెల్లంపూడి గ్రామ వద్ద ఆర్‌పీ రోడ్డుపై ఆదివారం సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అంబాజీపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ పక్కా ఏర్పాట్లు చేసింది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు అంబాజీపేట మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 431 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని మండల విద్యాశాఖాధికారులు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 431, ప్రైవేటు స్కూళ్ల నుంచి 91 మంది హాజరవుతున్నారన్నారు. అంబాజీపేట, తొండవరం, పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్షాల్లో ఎక్కడైనా మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే విద్యార్థులను డిబార్ చేస్తారన్నారు. కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. పరీక్ష కేంద్రంలో అధికారులతో సహా ఎవరూ సెల్‌ఫోన్ వాడరాదని ఆదేశించారు. ఆర్టీసీ బస్‌లో ప్రయాణించే విద్యార్థులు హాల్‌టికెట్ చూపిస్తే ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగా హాజరు కావాలన్నారు.

వైభవంగా వీరభద్రుని సంబరం

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలో బాల వీరభద్రస్వామి ఆలయం వద్ద ఆదివారం వీరభద్రస్వామి సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఉదయం స్వామిని మేలు కొలిపారు. అనంతరం భక్తులు వైనతేయ గోదావరి వరకు ఊరేగింపుగా వెళ్లారు. గోదావరి నదీస్నానంతో పాటు పలు పూజలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం శమీ పూజ, అష్టోత్తర పూజతో పాటు శూలాల సంబరం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి భక్తులు 60 గజాల పొడవు కలిగిన నిప్పులగుండం తొక్కారు. పినిశెట్టి వెంకటస్వామి, వెంకటరామారావు ఆధ్వర్యంలో జరిగిన సంబరంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.

పోషకాల గని పుచ్ఛ


అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

వేసవిలో శరీరానికి ఎంతో లాభం

అంబాజీపేట: వేసవి వచ్చిందంటే చాలు. ప్రజల దాహార్తిన్ని తీరుస్తూ ఎన్నో పోషక విలువలు మానవ శరీరానికి అందించడంలో పుచ్చకాయ అద్వితీయమైన పాత్ర పోషిస్తుంది. పుచ్చకాయ పుట్టిల్లు దక్షిణాఫ్రికా. అమెరికాకు పుచ్చకాయ 17వ శతాబ్దంలో పరిచయం అయింది. పుచ్చకాయల్లో సుమారు 1203 రకాలు ఉన్నాయి. ఎక్కువగా ఎరుపు రంగులో ఉన్నప్పటికీ ప్రస్తుతం పసుపు, పాల పసుపు, నారింజ తదితర రంగుల్లో కూడా లభ్యమవుతున్నాయి. కొవ్వు శాతం తక్కువ ఉన్న పుచ్చకాయలో చాలా మంది ఎర్రటి గుజ్జును మాత్రమే తింటారు. కాని శాస్త్రవేత్తల ప్రకారం ఎర్రటి గుజ్జు కింద ఉండే తెల్లని గుజ్జులో కూడా ఎన్నో పోషకాలున్నాయని చెబుతున్నారు. 100 గ్రాముల గుజ్జులో శక్తి 130 కిలోల క్యాలరీలు ఉంటాయి. పిండి పదార్థాలు 7.5 గ్రాములు, పీచు పదార్థాలు 0.4 గ్రాములు, ప్రొటీన్లు 0.6 గ్రాముల నీరు 91.5 శాతం, విటమిన్ 3 శాతం, విటమిన్–సి 8.1 మిల్లీ గ్రాములు, కాల్షియం 7 మిల్లీ గ్రాములు, ఐరన్ 0.24 మిల్లీ గ్రాములు, మెగ్నీషియం 10 మిల్లీగ్రాముల, పాస్ఫరస్ 11 మిల్లిగ్రాములు, పొటాషియం 112 మిల్లీగ్రాములు, జింక్ 0.1 మిల్లీ గ్రాములు ఉన్నాయి. చాలా మంది పుచ్చకాయ గింజల్లోను పోషకాలు ఎన్నో ఉన్నాయి. పుచ్చకాయ గింజలను ఎండబెట్టి పొడి రూపంలో తిన్న శరీరానికి ఎంతో మంచిది. కొన్ని దేశాల్లో పుచ్చ గింజల నుంచి నూనె తీస్తారు. పుచ్చకాయలో సెట్రాలిస్ అనే ఫైటో న్యూట్రియంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉన్న ఇతర ఎంజైములతో కలిపి ఆర్థనైన్ అనే అమినో ఆమ్లంగా మారుతుంది. దీని వల్ల గుండె పనితీరు, రక్త ప్రసరణ మెరుగుపడటం, రోగనిరోధక శక్తి పెరగటం జరుగుతుంది. పుచ్చకాయల్లో సుగర్ బేబి, అపాయి యమటా, జర్కజ్యోతి, ఆర్యా మానిక్, దుర్గాపూర్ రేసన్, మీరా, వసుద, పుప్రీత్, అపూర్వ, స్వీట్ డ్రాగన్, మహారాజా, నేత్రావతి, మాధురి తదితర రకాలున్నాయి. పుచ్చకాయ సాగుకు 23 నుండి 32 డిగ్రీల ఉష్ణోగ్రత అనుకూలం. నదీ పరీవాహక ప్రాంతాలు, ఇసుక తిన్నెలు, బంక మట్టి నేలలు మురుగు వసతి కలిగిన ఒండ్రు మట్టి నేలలో సాగు చేపడుతున్నారు.

శెట్టిబలిజలకు వైఎస్సార్ సీపీలోనే ప్రాధాన్యం


మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు శ్రీనివాస్

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ శెట్టిబలిజలకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, పి.గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ పేర్కొన్నారు. మామిడికుదురు బీసీ సామాజిక భవనంలో ఆదివారం జరిగిన సమావేశానికి పార్టీ నేత కాండ్రేగుల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఒక రాజ్యసభ, రెండు ఎమ్మెల్సీ, మూడు ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లతో పాటు నాలుగు కార్పొరేషన్ చైర్మన్ పదవులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించి ఏ పార్టీ ఇవ్వనంత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీకి శెట్టిబలిజలు అండగా నిలవాలని శ్రీనివాస్ సూచించారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నయినాల రామకృష్ణ, పితాని నర్సింహారావు, యాండ్ర వీరబాబు, వాసంశెట్టి రామకృష్ణ, జోగి రామకృష్ణ, కొప్పిశెట్టి హేమసుందర్, కడలి శ్రీను, చెల్లింగి రామకృష్ణ, గుబ్బల నాని, గుబ్బల నాగరాజు పాల్గొన్నారు.

పెదపట్నంలో టిప్పర్లను అడ్డుకుని ధర్నా


పెదపట్నంలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మామిడికుదురు: పి.గన్నవరం మండలం మానేపల్లి నుంచి మట్టిలోడుతో వెళ్తున్న టిప్పర్లను పెదపట్నం గ్రామస్తులు ఏటిగట్టు వద్ద అడ్డుకుని ఆదివారం ధర్నా చేశారు. మట్టి తరలింపుతో పెదపట్నం గ్రామంలోని రోడ్లు, వంతెనలు పాడైపోతున్నాయని నిరసన తెలిపారు. మానేపల్లి లంకలోని మట్టిని యథేచ్ఛగా తవ్వేయడం వల్ల పెదపట్నం గ్రామానికి ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లంకలో మట్టి తవ్వకాల వల్ల పెదపట్నం గ్రామంలోని గోదావరి మధ్యలంకలో ఉన్న భూములు నదీపాతానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. తమ గ్రామం మీదుగా మట్టి తరలింపును నిలుపుదల చేయాలని, మట్టి తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కోడేటి శంకరం, కట్టా సుబ్రహ్మణ్యం, గుబ్బల పండు, కొమ్ముల నందిబాబు, కడలి బానోజీప్రకాష్, బొక్కా చిన్న, కాజులూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక లక్ష కుంకుమార్చన


ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి


స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కనుమూరి బాపిరాజు దంపతులు

- సింహవాహనంపై స్వామి వారి ఊరేగింపు
- ముఖ్య అతిథిగా టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు

ఆత్రేయపురం: గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి శ్రీమాన్ ఖండవల్లి సూర్యనారాయణచార్యులు, సుదర్శనం సూర్య పురుషోత్తమ సత్యసాయి, ఆలయ అర్చకులు వాడపల్లి పవన్ దీక్షితులు, వేదపండితులు వాడపల్లి జనార్దనాచార్యులు, అనంతశర్మ ఆధ్వర్యంలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం సంప్రోక్షణ నిర్వహించి స్వామికి అలంకరించారు. అనంతరం బ్రహ్మోత్సవ కార్యక్రమాలను వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చతుర్దశ కలశారాధన, స్వామికి విశేష పంచామృతాభిషేకం, సామూహిక లక్షకుంకుమార్చన కార్యక్రమాలను అత్యంత రమణీయంగా నిర్వహించారు. స్వామికి పట్టు వస్త్రాలను టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు–అన్నపూర్ణ దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఐశ్వర్యప్రాప్తికి మహాలక్ష్మీ హోమం, తామరపుష్పాలతో నిర్వహించారు. ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో మంత్రముగ్ధుల్ని చేశాయి. కార్యక్రమంలో పాతపాటి కుటుంబ సభ్యులు పాతపాటి నాగరాజు, రామాంజనేయరాజు, రమణరాజుతో పాటు కుటుంబ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామి వార్ని సింహవాహనంపై గ్రామంలో ఊరేగించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు) ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు గోరింట వినయ్‌కుమార్‌రాజు, పాకలపాటి వెంకట్రాజు తదితరులు బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాల వికాస్‌తో చిన్నారుల్లో నైతిక విలువలు


పిల్లలకు నైతిక విలువల గురించి చెబుతున్న డాక్టర్ ప్రభాకర్

అమలాపురం టౌన్: సత్యసాయి బాల వికాస్ కేంద్రాల ద్వారా చిన్నారులకు నైతిక విలువలపై అవగాహన పెరుగుతోందని అమలాపురం డివిజన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని అన్నాబత్తులవారి వీధిలో కొత్తగా ఏర్పాటైన సత్య సాయి బాల వికాస్ కేంద్రాన్ని డాక్టర్ ప్రభాకర్ ఆదివారం ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు నీతి కథలు, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. ప్రతి ఆదివారం శిక్షణ కార్యక్రమం ఉంటుందని డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగన్ ఓ ప్రభంజనం

రాజోలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి


అడవిపాలెంలో పార్టీ నాయకులతో భేటీ అయిన ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు


మోరిపోడులో గొల్లపల్లిని సత్కరిస్తున్న గ్రామస్తులు

మలికిపురం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఓ ప్రభంజనం అని, ఆ సంగతి ప్రతిపక్షాలకు బాగా తెలుసునని, వచ్చే ఎన్నికల అనంతరం కూడా ఆయనే సీఎం అని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని గూడపల్లి పల్లిపాలెం, అడవిపాలెం గ్రామాల్లో పర్యటించారు. పార్టీ శ్రేణులను కలసి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం వెళ్లిందని, ప్రతి ఇంట్లోనూ నలుగురు పథకాల లబ్ధిదారులు ఉన్నారని అన్నారు. దేశంలో ఎక్కడా ఇటువంటి పరిస్థితి లేదన్నారు. ఇంతటి ఘన కీర్తి కలిగిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక తనయుడు రాపాక వెంకట్‌రామ్, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, సర్పంచ్‌లు పెచ్చెట్టి నరసింహస్వామి, కొల్లు అనంతలక్ష్మి, మనస్సే ప్రసాద్, నల్లి సత్యనారాయణ, మంగెన సింహాద్రి, బండారు కాశి తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమతూకంలో ఒక్క సీఎం జగన్‌తోనే సాధ్యమైందని రాజోలు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం ఆ పార్టీ కేడర్, ప్రముఖులను మర్యాద పూర్వకంగా కలిసే క్రమంలో వేర్వేరు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. సఖినేటిపల్లిలో ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రాపాక దీవెనకుమారి, ఎంపీటీసీ నల్లి రత్నకుమార్, మండల కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, రాపాక సూర్యప్రకాష్‌లను కలిశారు. అలాగే సఖినేటిపల్లి లూథరన్ చర్చిలో క్రైస్తవ సోదరులు, సోదరీమణులతో కలసి క్రీస్తు ప్రభువు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. చర్చిలో వారందరినీ ఆత్మీయంగా పలకరించారు. కాగా మోరిపోడు రంపాలమ్మ అమ్మవారి గుడి వద్ద స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో గొల్లపల్లి సమావేశమయ్యారు. వారంతా గొల్లపల్లిని అభినందిస్తూ సత్కరించారు.

విగ్రహాలకు ముసుగులు.. ఫ్లెక్సీల తొలగింపు


ఆదుర్రులో జెండా దిమ్మలకు ముసుగులు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

మామిడికుదురు: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాజకీయ నాయకుల విగ్రహాలకు, పార్టీ దిమ్మలకు ఉద్యోగులు ఆదివారం ముసుగులు వేయించారు. దీంతో పాటు రాజకీయ పార్టీల నేతల చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సమూలంగా తొలగించారు. జాతిపిత మహాత్మాగాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు మినహా మిగిలిన విగ్రహాలన్నింటికి ముసుగులు వేశారు. మామిడికుదురు మండలంలోని 18 గ్రామాల్లోను ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఫ్లెక్సీల తొలగింపు, దిమ్మలకు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఫ్లెక్సీలను తొలగించారు.

ఘనంగా వేణుగోపాలుని విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో వేంచేసిన రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం నూతన శిలా విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. వైఖానస పద్ధతిలో ప్రముఖ వేద పండితుడు వాడపల్లి గోపాలాచార్య స్వామి ఆధ్వర్యంలో పురోహితుల బృందం ఈ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం యంత్ర స్థాపన, కళావాహన గోదర్శనం, శాంతికారక కల్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ ఉత్సవాన్ని తిలకించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ముంజవరపుకొట్టు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార సరుకుల ప్రదర్శన

పి.గన్నవరం: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.జ్యోతి, టి.భారతి అన్నారు. మండలంలోని ముంజవరపుకొట్టు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార సరుకుల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల ఆరోగ్యం, వారికి అందించాల్సిన పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, తల్లులు, కిశోరీ బాలికలు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు

పి.గన్నవరం: ముంగండపాలెం శివారు గాజులగుంటలో ఆదివారం సారా తయారు చేస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. గాజులగుంట గోరింకల డ్రెయిన్ వద్ద గుత్తుల ప్రకాశరావు సారా తయారు చేస్తుండగా దాడి చేసి అతడిని పట్టుకున్నట్టు వివరించారు. అతడి నుంచి 10 లీటర్ల సారాతో పాటు, సారా తయారీకి వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్, స్టవ్, మూడు అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వివరించారు.

విద్యార్థులకు వేసవి వినోదం

అమలాపురం టౌన్: విద్యార్థుల్లో మానసిక వికాసం, విజ్ఞానం కోసం వేసవి వినోదం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.మురుగేశ్వరరావు అన్నారు. వేసవి వినోద కార్యక్రమాల నిర్వహణపై స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లు, వలంటీర్లు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సహకారంతో త్వరలో వేసవి వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సత్యనారాయణ, యూటీఎఫ్ మహిళా ప్రతినిధి చంద్రకళ, పట్టణ ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ హమీద్ దున్నీషా, టి.నాగ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ప్రజల్లో తిరుగులేని ఆదరణ

పి.గన్నవరం అభ్యర్థి విప్పర్తి


అప్పనపల్లి సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీకి ప్రజల్లో తిరుగులేని ఆదరణ లభిస్తోందని పి.గన్నవరం నియోజకవర్గం అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు చెప్పారు. అప్పనపల్లిలో ఆదివారం పిచ్చుక చిన్న స్వగృహం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన జగన్‌కు అండగా నిలవాలని ప్రజల్లో ఒక దృఢమైన సంకల్పం నెలకొందన్నారు. ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ సీపీకి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని వేణుగోపాలరావు చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు గెద్దం మంగాలక్ష్మి, బొంతు నీలిమ, కొమ్ముల రాము, గెద్దం వెంకటేశ్వరరావు, జక్కంపూడి తాతాజీ, తోరం సూర్యభాస్కర్, బత్తుల జనార్దనరావు, తులా గోపాలకృష్ణ, తెన్నేటి కిశోర్, కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మన రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకే వేద్దాం


అయినవిల్లి మండలం పోతుకుర్రులో పార్టీ నాయకులతో విప్పర్తి వేణుగోపాలరావు

అయినవిల్లి: మన రెండు ఓట్లు ఈ సారి కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే వేద్దామని మరలా రాష్ట్ర సీఎంగా ఆయన్నే గెలిపిద్దామని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం ఆయన పోతుకుర్రులో పార్టీ నాయకులను, కార్యకర్తలను, అభిమానులను కలసి పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. రాష్ట్ర ప్రజల కోసం పనిచేసే నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఆయనే అయితేనే రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులుతీస్తుందన్నారు. పొత్తులతో కుయుక్తులు పన్నే నాయకులు రాష్ట్రానికి ఏ విధమైన మేలు చేయరని ఆయన అన్నారు. గడిచిన అయిదేళ్లలో రాష్ట్రంలో నవరత్నాల పేరిట అందించిన సంక్షేమం ఎవరి ప్రమేయం లేకుండా, ఎవరి రికమెండేషన్ లేకుండా అర్హులైన పేదలకే చేరాయన్నారు. తొలుత గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ, మాగాం సర్పంచ్ కాశి వీవీ సత్యనారాయణమూర్తి, కమిడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి పుల్లయ్యశెట్టి, చంటి తదితరులు ఉన్నారు.

21 నుంచి కల్యాణోత్సవాలు


ఉభయ దేవేరులతో కొలువుదీరిన సత్యనారాయణస్వామి

మామిడికుదురు: మాకనపాలెంలో కొలువుదీరిన అనంతలక్ష్మీ, భూదేవి సమేత సత్యనారాయణ స్వామి వారి 72వ వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ ఆదివారం తెలిపింది. 21వ తేదీ ఏకాదశి గురువారం ఉదయం వ్రతాలు, మొక్కులు, అభిషేకాలతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఈ ఉత్సవాలు సోమవారం వరకు అయిదు రోజుల పాటు జరుగుతాయని కమిటీ పేర్కొంది. ఉత్సవాలు జరిగే అయిదు రోజులు వరుసగా గరుడ, శ్రీఆంజనేయపుష్పక, గంధర్వాశ్వ, సర్ప, పొన్న వాహనాలపై స్వామి వారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు


రావులపాలెంలో తిరుచ్చివాహనంపై వెంకటేశ్వరస్వామి ఊరేగుతున్న గోవింద మాలధారులు

రావులపాలెం: స్థానిక పార్కు ప్రాంగణంలో వేంచేసిన అలివేలు మంగా పద్మావతి, ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే గోవింద మాలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయ అర్చకులు వాడపల్లి కమలనాథాచార్యులు, ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో గోవిందమాలను ధరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తుహోమం, బలిహరణ తదితర కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో గోవింద మాలధారులు స్వామివారిని తిరుచ్చి వాహనంపై మేళతాళాలతో, బాజా భజంత్రీలతో ఊరేగించారు. రాత్రికి స్వామి వారికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్ద శేష వాహనోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం శేషవాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కన్నుల పండువగా ఆలయ వార్షికోత్సవం


పోలేరమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: మండలంలోని పోలేకుర్రు గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి ఆలయ 18వ వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద పండితులు మర్ల ఫణిశర్మ బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వేదపండితులు కందికొండ బాబి, చావలి రవి, కందికొండ చందు తదితరుల నేతృత్వంలో అమ్మవారికి మహిళలచే సామూహిక కుంకుమ పూజలు చేయించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పోలేకుర్రు, తాళ్లరేవు, మల్లవరం, సుంకటరేవు, ప్రత్తిగొంది, జార్జిపేట, యానాం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పోతుల చక్రశేషారావు, పుప్పాల శ్రావణకుమార్, గంగిరెడ్డి రాము, పోతుల వీరేంద్ర, చరణ్ తదితరులు పర్యవేక్షించారు.